క్లుప్తంగా

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని 6వ వార్డులోని రాంనగర్‌కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో వేముల సుమన్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ శివరాణి, సంతోష తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



భూదాన్‌పోచంపల్లి ప్రాథమిక పాఠశాలలో యోగాసనాలు వేసిన విద్యార్థులు

ఆలేరు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని వివేకానంద యోగా కేంద్రం శిక్షకులు బండిరాజుల శంకర్ అన్నారు. పట్టణంలోని యోగా కేంద్రంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉచిత యోగా తరగతులను గురువారం ప్రారంభించారు. నిత్యం యోగా చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం యోగా డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 100 సంఖ్య ఆకృతిలో కూర్చుని ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, ఉపాధ్యాయులు హరిణి, కళావతి, జ్యోతి, సంధ్యారాణి, ప్రత్యేక ఉపాధ్యాయుడు బోయ శ్రీనివాసులు, ఐఈఆర్‌పీ సుధామణి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఆత్మకూరు(ఎం): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఏపీఎం పక్కీరయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల, కోశాధికారులు శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వయం ఉపాధి పొందడానికి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రతి నెల సమ భావన సంఘాల సమావేశాలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఓ ఆనంద్, జిల్లా సమాఖ్య ప్రధాన కార్యదర్శి రచ్చ పల్లవి, మండల ప్రధాన కార్యదర్శి గండు మాధవి, కోశాధికారి దుంప కవిత, సీసీలు వెంకన్న, లోడి భాస్కర్, కంప్యూటర్ ఆపరేటర్ నల్ల చంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ కళాశాలలో జాబ్ మేళా

భువనగిరి : మండలంలోని రాయగిరి గ్రామంలో యూనిటీ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎంఎస్ఎన్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి కళాశాల డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ సరిత, ఏఓ సునిత, మోహిని, ఇస్మాయిల్, అనిత, రాజీవ్, ప్రియాంక, అమరనాథ్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

వలిగొండ : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈఓ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని మొగిలిపాక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నం పాండు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

భువనగిరి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ పర్యావరణ పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ పట్నం కపిల్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు బీజేపీకి 25వేల మొక్కలు అందజేయాలని కోరుతూ గురువారం బీజేపీ జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో నర్సరీ కేంద్రాల వద్ద మొక్కలు తీసుకుని ప్రతి బూత్ పరిధిలో 11 మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏలే చంద్రశేఖర్, పట్టణ కమిటీ అధ్యక్షుడు రత్నపురం బలరాం, నాయకులు ఉమాశంకర్‌రావు, రాళ్లబండి కృష్ణాచారి, ఉడుత భాస్కర్, కోల్లోజు శ్రవణ్, రామకృష్ణ, నర్సింగరావు, మల్లికార్జున్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న కోతుల బెడద

- రామన్నపేటలో వానరాలు పట్టించేందుకు గరిక ఫౌండేషన్ చర్యలు
- రెండు రోజుల్లో 400 కోతుల వరకు పట్టివేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రామన్నపేట : రామన్నపేట వాసులకు కోతుల బెడద తీరనుంది. పట్టణంలోని కోతులను పట్టించి అటవీ ప్రాంతానికి తరలించేందుకు గరిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గరిక సత్యనారాయణ ముందుకు వచ్చారు. కోతులను పట్టుకునేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేకంగా 12మంది జట్టు సభ్యులను తీసుకువచ్చారు. పట్టుకున్న కోతుల గుంపును అడవి ప్రాంతాలకు అవసరమయ్యే ఏర్పాట్లను చేశారు. కోతులను పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఇనుప మెస్ సిద్ధం చేశారు. కోతులకు ఆహారం ఎరగా చూపించి వాటిలో చిక్కుకునేలా వ్యూహం పన్ని కోతులను పట్టుకుంటున్నారు. బుధవారం, గురువారం రెండు రోజుల్లో సుమారు 200కోతుల వరకు పట్టుకున్నారు. పట్టుకున్న చిన్నచిన్న బోనుల లోకి మార్చి డీసీఎంలోకి ఎత్తి శ్రీశైలం సమీపంలోని అడవిలో వదిలిపెడుతున్నారు. పదిహేను రోజుల్లో పట్టణంలోని కోతులన్నింటినీ పట్టి అడవికి తరలించనున్నారు. కోతుల బెడద తప్పుతుండడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గరిక ఫౌండేషన్‌ను ప్రజలు అభినందిస్తున్నారు.



బోనులో బంధించిన వానరాలు

తీరనున్న తిప్పలు

రామన్నపేట పట్టణంలోని ప్రతి కాలనీలో వందల సంఖ్యలో వానర మూకలు ఉన్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలపై తరచూ దాడి చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి నిత్యావసరాలు ఎత్తుకుపోవడం చేస్తుండడడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉండేది. కోతుల బారి నుంచి తప్పించు కోవడానికి ఆర్థికంగా ఉన్నవారు సోలార్ ఫెన్సింగ్‌ను, ఇనుప జాలీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే కోతుల బెడదను పరిష్కరించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదు. గరిక ఫౌండేషన్ వారు సమస్య తీవ్రతను గుర్తించి సుమారు రూ.3.50లక్షలు ఖర్చు చేసి కోతులను పట్టిస్తున్నారు. దీంతో పట్టణంలో కోతుల బెడద తీరనుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిత్యం వందల కోతులు ఉంటాయి. తలుపు తెరిచి శుభ్రం చేద్దామంటే గుంపులు గుంపులుగా లోపలికి వచ్చేవి. దారివెంట వెళ్లేవారిని భయభ్రాంతులకు గురి చేసేవి. చేతిలో కవర్లు కనిపిస్తే దాడిచేసి లాగేసుకుంటాయి. కోతులను పట్టి అడవులకు తరలిస్తుండడం సంతోషంగా ఉంది.

– లింగమ్మ, అటెండర్, టీటీడీ కల్యాణమండపం

ప్రజల బాధలు చూసి చలించిపోయా



పట్టణ ప్రజలు కోతుల బెడదను తట్టుకోలేక చాలా అవస్థలు పడుతున్నారు. ప్రజల బాధలు చూసి చలించిపోయాను. మిత్రుల సూచనతో గరిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోతులను పట్టి అడవికి తరలించాలని నిర్ణయం తీసుకున్నాను. ప్రజలకు ఏదో రకంగా సేవ చేయాలని..జన్మభూమి రుణం తీర్చుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తా.

– గరిక సత్యనారాయణ, ఫౌండేషన్ చైర్మన్

భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, హనుమాన్‌వాడలో ఆయన పర్యటించారు. స్థానికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అఖిలపక్ష పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి వివరించారు. అంబేడ్కర్, హైదరాబాద్, నల్లగొండ చౌరస్తా అభివృద్ధితో పాటు, గ్రీనరీ చేస్తామని, కళాశాల అవరణలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు చేస్తున్నట్లు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామలింగం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్‌చిస్తీ, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, పొత్నక్ ప్రమోద్‌కుమార్, సోమయ్య, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, ఏజాజ్, ఎండీ మజహర్, ఈరపాక నర్సింహ, లయిఖ్‌అహ్మద్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆత్మకూరు(ఎం): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని.. మండల స్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేక అధికారి రాజారామ్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వివిధ శాఖల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పాలకవర్గాలు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే గ్రామంలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఇటీవల రైతు వేదికలో నిర్వహించిన సీఎం టెలీ కాన్ఫరెన్స్‌లో రైతులను సమీకరించడంలో విఫలమయ్యారని వ్యవసాయ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో తహసీల్దార్ వి.లావణ్య, ఎంపీడీఓ రాములు నాయక్, ఎంఈఓ కొత్త మహదేవరెడ్డి, సూపరింటెంట్ ఎలిమినేటి లోకేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ పద్మావతి, ఏఈ ప్రదీప్, ఏపీఓ బి.రమేష్, ఏపీఎం పక్కీరయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజారామ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయి

- ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ వీమల, వైస్ చైర్మన్ లింగాల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి, డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, ఇటికాల చిరంజీవి, బాలెంల సైదులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సామేలు

భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నోటీసులు జారీ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులు ముగియున్నందున క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. సమావేశంలో భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి కృష్ణారెడ్డి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, అన్ని మండలాల తహసీలార్లు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

యాదగిరిగుట్ట : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ గణేష్ అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని గుండ్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిటౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : భూ భారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ విజయసింహారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

భువనగిరిటౌన్ : అమెరికా అండతో ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్, న్యూ డెమోక్రసీ అధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి జనార్దన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న ఆగడాలు ప్రపంచ ప్రజలంతా వ్యతిరేకిస్తున్న అమెరికా మాత్రం పోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు, నాయకులు మామిడాల భిక్షపతి, కళ్లెపు అడివయ్య, సోమయ్య, సహదేవ్, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, రాజు, వెంకటేష్, దాసరి లక్ష్మయ్య, అంజయ్య, రమేష్, వెంకటరెడ్డి, సత్తయ్య, రేష్మ, కృష్ణ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

భువనగిరిటౌన్ : జూలై 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ అన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కార్మికులు ఏకం కావాలన్నారు. సమ్మెకు కార్మికులు తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా , గొరిగె సోములు, జిల్లా సహాయ కార్యదర్శులు మాయ కృష్ణ , తుర్కపల్లి సురేందర్ , జి ఆదిమూలం నందీశ్వర్, బత్తుల దాసు, పోతరాజు జహంగీర్, మొరిగాడి రమేష్, దేవేందర్ రెడ్డి, రాధారపు మల్లేష్, తూటి వెంకటేష్, వడ్డేపల్లి యాదగిరి, మునీశ్వర్ రెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోంది

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్

యాదగిరిగుట్ట: కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తోందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్, యాదగిరిపల్లిలో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. 11సంవత్సరాల మోదీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెట్టి తామే ఇస్తున్నామని చెప్పుకోవడం దారుణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆకుల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులు మందోజు నరేష్, జిల్లా భానుచందర్, పట్టణ ఉపాధ్యక్షులు గౌళికార్ జవహర్, కార్యదర్శి ఆవుల సత్యనారాయణ, ఆలేటి కర్ణ, పలుగుల సురేష్, మిట్ట వీరేశం, సీనియర్ నాయకులు బందారపు మల్లేష్‌గౌడ్, జానకీరాము, రంగ సత్యం, బోడ బుచ్చిబాబు, గాదె వంశీ, సూధగాని శివ, బరిగే ఉమా మహేష్, దేవేందర్, వాల్మీకి అజయ్, సంద ప్రవీణ్, విజయ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆలేరు: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నందగంగేష్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహించారు. పీఎం నరేంద్రమోదీ 11ఏళ్లలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పల్లెలు, పట్టణాల అభివృద్ధికి మంజూరు చేసిన నిధుల గురించి వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిటికారి కృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి తునికి దశరథ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్డేమాన్ నరేందర్, ప్రధాన కార్యదర్శులు ఎలగల వెంకటేష్, సుంకరి సృజన్, ఉపాధ్యక్షులు రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు గుంటిపల్లి మహేశ్వరి, సత్యనారాయణ, నారాయణ, గోపగాని ప్రసాద్, సునీత,యాకుబ్, ఉదయ్, పోశెట్టి, శ్యామ్, రాజు వెంకటేష్ పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట: మాట్లాడుతున్న పాశం భాస్కర్



ఆలేరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తుర్కపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీజేపి ఎస్టీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని బిల్యాతండాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పడాల శ్రీనివాస్, బానోత్ నరేందర్, భూక్య నరేష్, కిషన్, మేకల శ్రీనివాస్ యాదవ్, ఏసి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తార్య నాయక్, శత్రు నాయక్, రమేష్, రాము నాయక్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీలో వంద రోజుల యాక్షన్ ప్లాన్ కొనసాగుతోంది. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో తడి, పొడి, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, పర్యావరణ ఇంజనీర్ శ్రవణ్, శానిటైజేషన్ సూపర్‌వైజర్ వీరస్వామి, రిసోర్స్ పర్సన్లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

చౌటుప్పల్ : పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు బాతరాజు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ అన్నారు. పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివసేన జిల్లా కార్యాలయాన్ని గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే పరిశ్రమలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు వినోదుల నర్సింహా రావు, కార్యాలయ ప్రముఖ్ శివ, జిల్లా నాయకులు ఏర్వ వెంకటయ్య, తత్తరి ఆశీష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలి

భువనగిరిటౌన్ : గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బట్టుపల్లి అనురాధ, జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, జయరాములు, మద్దెపురం రాజు, గడ్డం వెంకటేష్, నాయకులు పల్లెర్ల అంజయ్య, అన్నంపట్ల కృష్ణ, వడ్డేబోయిన వెంకటేష్, లావుడియా రాజు, ప్రకాష్, ఓవల్దాస్ అంజయ్య, భాస్కర్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

క్రీడా మైదానం చదును

సాక్షి ఎఫెక్ట్..

రామన్నపేట : రాళ్లు రప్పలు.. చెత్తా చెదారంతో నిండిన సిరిపురం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంపై గురువారం సాక్షి దినపత్రికలో క్రీడా మైదానం ఇలా...ఆటలు ఆడేదెలా? అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. మైదానాన్ని డోజర్‌తో చదును చేయించారు. క్రీడా మైదానంను ఆడుకునే విధంగా తీర్చిదిద్దిన పంచాయతీ అధికారులకు, సాక్షి దినపత్రికకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.



చదును చేసిన అనంతరం క్రీడా మైదానం

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఆలేరురూరల్ : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు ఎం.ఎ.ఎజాజ్, కొంద్రాజు వెంకటేశ్వరరాజు, ముదిగొండ శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యువజన కాంగ్రెస్ నాయకుడు మైసోల్ల ప్రవీణ్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాశం సత్తిరెడ్డి, నూతి రమేష్, బోళ్ల శ్రీనివాస్, ఉలిపే మల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గ్యార సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఉపాధ్యక్షుడు భాను, గణేశ్, సురేశ్, నవీన్, మహేశ్, భాను, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు అరుణ్, నాయకులు కుమార్, చేరాల మహేశ్, ప్రశాంత్, సన్నీ, అక్షయ్ పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహా రెడ్డి, బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి, రాచకొండ బాలరాజు గౌడ్, మలిపెద్ది మల్లారెడ్డి, మందుల సురేష్, ముద్దం జయశ్రీ , అన్నెపు పద్మ, ఎండీ.అయాజ్, సుంకిశాల అనిల్, బందెల రవి, పాలోజు శేఖరాచారి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అడ్డగూడూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

రామన్నపేట : మండలకేంద్రంలో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జీపీఎస్ పాఠశాలలో నోటుబక్స్ పంపిణీ చేశారు. యూత్‌కాంగ్రెస్ మండలఅధ్యక్షుడు బట్టె సంతోష్ ఆధ్వర్యంలో ఆస్పత్రి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీసీకాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, అంగన్‌వాడీ చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగు రఘుమారెడ్డి, ఉపాధ్యక్షుడు పున్న అమరేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దిన్, జినుకల ప్రభాకర్, ఎండీ రెహాన్, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, మీర్జా బషీర్, అబ్రహంకుమార్, బొడ్డు, మేడి శంకరయ్య, బొడ్డు సురేందర్ పాల్గొన్నారు.

రాజాపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాలరాజుగౌడ్, రాంజీ నాయక్, పెంటయ్య గౌడ్, గాల్‌రెడ్డి, యాదేష్ పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లి : నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, అనంతరెడ్డి, పోతగాని మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండలకేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎమ్మెల్యే మందుల సామేలు అరటిపండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను మండల వైద్యాధికారి భరత్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జోజి, పీఏసీఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి, నర్సిరెడ్డి, డైరెక్టర్లు బాలెంల విద్యాసాగర్, చిత్తలూరి సోమన్న, ఇటికాల చిరంజీవి, జోసఫ్, బాలెంల సైదులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీల అమలులో విఫలం

భువనగిరిటౌన్ : హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. గురువారం సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సమావేశాన్ని కార్యవర్గ సభ్యురాలు కల్లూరు నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పట్టణ కార్యవర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య పట్టణ నాయకులు బర్ల వెంకటేష్, వల్దాస్ అంజయ్య, దాసరి మంజుల పాల్గొన్నారు.

చెక్కు అందజేత

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన అన్నెపు జ్యోతికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.46వేల చెక్కును గురువారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహా రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాచకొండ బాలరాజు గౌడ్, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మందుల సురేష్, అనిల్, అన్నెపు నర్సింహ, శేఖరాచారి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేసినవారిపై చర్య తీసుకోవాలి

భువనగిరిటౌన్ : సోషల్ మీడియాలో తనపై అసత్య ఆరోపణలు చేసినవారిపై చర్య తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండీ అతహర్ గురువారం పట్టణ ఎస్ఐ కుమారస్వామికి ఫిర్యాదు చేశారు. తమ ఫార్మా కంపెనీ చెక్ బౌన్స్ కేసును తన వ్యక్తిగత కేసుగా పేర్కొంటూ, చెక్ ఫోర్జరీ చేశానని సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగులు పెడుతూ వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుండాల : మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయాగా పని చేస్తున్న శాఖాపురం పుల్లమ్మ గురువారం మృతి చెందింది. ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోత్స్న మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ షమీమ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పల్లెర్ల పాల సంఘం అధ్యక్షురాలిగా మంజుల

ఆత్మకూరు(ఎం): మండలంలోని పల్లెర్ల గ్రామ పాల సంఘానికి గురువారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా సోలిపురం మంజుల, డైరెక్టర్‌గా ఏనుగు మంజుల ఎన్నికయ్యారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా కమిటీలో మండలవాసులు

మోత్కూరు : యాదాద్రి భువనగిరి జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలను ఇటీవల నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన బుక్కా చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బత్తుల అయిలయ్య, మేడబోయిన యాదగిరి ఎన్నికయ్యారు.

మోత్కూర్‌ను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

మోత్కూరు : మోత్కూరును నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు కలిమెల నర్సయ్య, మోత్కూరు మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బ్రహ్మచారి, బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ అధ్యక్షుడు నిలిగొండ మత్స్యగిరి, మర్రి ఆనందం, సత్యవర్ధన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. శిథిల భవనాలు.. అరకొర వసతులు.. తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత.. వెరసి అనేక సమస్యలతో బడులు కునారిల్లుతున్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేక విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. మధ్యాహ్న భోజనం తయారీకి వంట గదులులేక ఆరు బయట చేయాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా గదులు లేక చెట్లకిందే భోజనం చేయడమేకాకుండా చదువులు కొనసాగించాల్సి వస్తోంది. చాలా చోట్ల ఉపాధ్యాయులు ఉన్నా విద్యార్థులు లేక స్కూళ్లు మూతపడ్డాయి. మన ఊరు– మనబడి పథకం కింద చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గురువారం 'సాక్షి' విజిట్‌లో పలు సమస్యలు వెలుగు చూశాయి.

సర్కారు బడి.. సమస్యల ఒడి

అస్తవ్యస్తంగా ప్రభుత్వ పాఠశాలలు

- అరకొర వసతులతో ఆరుబయటే చదువులు
- తగినన్ని మరుగుదొడ్ల లేక పాట్లు
- విద్యార్థులు లేక కొన్నిచోట్ల మూత
- తాగునీటికీ ఇబ్బందులే



శిథిలావస్థకు చేరిన జగత్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

మూత్రం వస్తే ఉగ్గబట్టాల్సిందే..

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండలం మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో 25 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో మూత్రశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూత్రశాలల్లో నీటి సౌకర్యం కూడా లేదు.



మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన మూత్రశాలలు

మూడు తరగతులు.. ఆరుగురు విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జగత్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు ఆరుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాల భవనం 15 ఏళ్లుగా పడావుగా ఉండి. తలుపులు, కిటికీలు విరిగి శిథిలావస్థకు చేరింది. దాంతో గ్రామంలోని యువజన సంఘం భవనంలో తాత్కాలిక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం గ్రామంలో బడిబాట, గ్రామసభ పెట్టి బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, తాము సైతం ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన చేస్తామని చెప్పినా ఒక్కరూ కూడా చేరలేదు. గత సంవత్సరంలో వచ్చిన ఆరుగురు విద్యార్థులు పైతరగతికి వచ్చారు. 1వ తరగతిలో ఇద్దరు, రెండో తరగతిలో ఒక్కరు, మూడో తరగతిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు ఉన్నారు.



కనీస సౌకర్యాలు లేక నేలపైనే బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

వసతులు, విద్యార్థులూ.. అరకొరే



గుంటిపల్లి పాఠశాలలో ఐదు తరగతులకు హాజరైన ఆరుగురు విద్యార్థులు

నిడమనూరు : నిడమనూరు మండలంలోని పలు పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నాయి.. విద్యార్థులు కూడా తక్కువ సంఖ్యలోనే ఉన్నారు. 33 ప్రాథమిక పాఠశాలల్లో 896 మంది విద్యార్థులు ఉన్నారు. ఆరుచోట్ల విద్యార్థుల సంఖ్య సున్నాకు చేరింది. గగినపల్లివారిగూడెం, రాజన్నగూడెం, కుంటిగొర్లగూడెం గ్రామాల్లో పదికంటే తక్కువ మంది ఉన్నారు. వేంపాడు పాఠశాలలో 26 మంది విద్యార్థులు ఉండగా, ఒక్క ఉపాధ్యాయురాలే ఈరోజు విధులకు హాజరయ్యారు. ఎర్రబెల్లి పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా ఈరోజు ఇద్దరే హాజరయ్యారు. గుంటిపల్లి పాఠశాలో ఐదు తరగతులకు ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు.

శిథిలమైన మూత్రశాలలు

మోత్కూరు : మోత్కూరు మండలం దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ విద్యార్థులకు ప్రమాదకరంగా మారింది. 6 నుండి 10వ తరగతి వరకు 54 మంది విద్యార్థులు ఉన్నారు. 8 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో మూత్రశాలలు శిథిలమయ్యాయి. దీంతో బాలురు పాఠశాల చెరువులో ఉన్న చెట్ల మాటున మూత్ర విసర్జనకు వెళతారు. స్పెషల్ డెవలప్‌మెంట్ కింద రూ.8 లక్షలు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు చేశారు. గత సంవత్సరం కాంట్రాక్టర్ టాయిలెట్స్ నిర్మాణం కోసం పునాది గుంతలు తవ్వి అర్ధాంతరంగా వదిలేశారు.



దత్తప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిథిలమైన టాయిలెట్స్.

కురుస్తున్న తరగతి గది స్లాబ్

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని సీతారాంపురం(షాబునగర్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండగా 16మంది పిల్లలున్నారు. ఆ పాఠశాలలో రెండు గదులతో పాటు ఒక ఆఫీస్ ఉంది. అయితే వర్షం వచ్చిందంటే స్లాబ్ నుంచి వర్షపు నీరు గోడల వెంట తరగతి గదుల్లోకి చేరుతుంది. ఆ పాఠశాలలో మంచినీటి సమస్య, మూత్రశాలలు, మరుగుదోడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వర్షం వచ్చిందంటే మాత్రం ఈ పాఠశాల చుట్టూ వర్షపునీటితో కమ్ముకుంటుంది.



సీతారాపురం ప్రాథమిక పాఠశాలలో గోడల నుంచి వస్తున్న వర్షపునీరు

రైతు వేదికలో తరగతుల నిర్వహణ



దిర్శనపల్లి రైతు వేదికలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నూతనకల్: మండల పరిధిలోని దిర్శనపల్లి ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో నూతన తరగతి గదుల నిర్మాణాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో అదే గ్రామంలోని రైతు వేదికలో తరగతులను నిర్వహిస్తున్నారు. రైతుల అవసరాల కోసం నిర్మించిన రైతు వేదిక పాఠశాలగా మారడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

తరగతి గదులు సరిపడా లేవు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ పాఠశాలలో 6 నుండి 10వ తరగతి దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి మొత్తం 10 తరగతి గదులు అవసరం కాగా 8 తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో వరండాలో ఒక తరగతిని, డైనింగ్ హాల్లో మరో తరగతి వారిని కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. ఇదే పాఠశాల అవరణలో మరమ్మతులు చేస్తే వినియోగంలోకి వచ్చే 4 తరగతి గదులు ఉన్నాయి. వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు, గోడలు కూలిపోతున్న గదులు 8 వరకు ఉన్నాయి. వీటిని పూర్తిగా తొలగించకపోవడం వల్ల ఆ పాఠశాల ఆవరణలో పాములు, విష పురుగులు సంచరిస్తున్నాయి. దీంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు.



శిథిలావస్థకుచేరి కూలిపోతున్న గదులు



మరమ్మతులకు నోచుకోని గదులు



పెచ్చులు ఊడుతున్న తరగతిగది పైకప్పు



శేరిగూడెం పాఠశాలలో విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడు

విధుల్లో టీచర్.. కనిపించని పిల్లలు

గట్టుప్పల్ : గట్టుప్పల్ మండలం శేరిగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రావడం లేదు. ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు నిత్యం విధులకు హాజరై సమయం ముగిశాక ఇంటికి వెళ్తున్నారు. ఐదారేళ్లుగా విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రయత్నం చేయడం.. విద్యార్థులు రాకపోవడంతో ఇక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలకు పంపుతున్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించమని వేడుకున్నా తల్లితండ్రులు మాత్రం వినడం లేదని ఉపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

శిథిలావస్థలో చెరువు అన్నారం పాఠశాల

కట్టంగూర్ : మండలంలోని చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శిథిలాస్థలో ఉన్న భవనంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సరిపడా తరగతి గదులు లేక ప్రధానోపాధ్యాయుడి గదిలో కూడా పాఠాలు బోధిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితమే భవనం కూల్చాలని ఆదేశాలు వచ్చినా నేటికీ కూల్చలేదు. పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న 5 తరగతి గదులు స్లాబ్, గోడలు పూర్తయ్యాయి. నేటికీ ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు.



శిథిలావస్థలో ఉన్న చెరువుఅన్నారం ప్రాథమిక పాఠశాల

విద్యార్థులు తక్కువ ఉపాధ్యాయులు ఎక్కువ

చెరువు అన్నారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఆరుగురు ఉపాధ్యాయులతో కలిసి మొత్తం ఏడుగురు సిబ్బంది ఉన్నారు. పాఠశాలలో 68 విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా అదనంగా ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.

అసంపూర్తి భవనాల్లోనే చదువులు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పూర్వకాలం నాటి భవనాన్ని తొలగించి నూతన భవనాన్ని నిర్మించాలని తలపెట్టారు. ఈ మేరకు పాఠశాల పాత గదులను కూలగొట్టి నూతనంగా నిర్మాణాన్ని చేపట్టారు. స్లాబ్ వేసినా పైసా బిల్లు అందకపోవడంతో కంట్రాక్టరు నిర్మాణాన్ని నిలిపివేశాడు. ఇంతలో ప్రభుత్వం మారడంతో మన ఊరు– మన బడి పథకాన్ని పక్కకు పెట్టారు. దీంతో రెండేళ్లుగా భవన నిర్మాణం స్లాబ్ దశలోనే నిలిచిపోగా తరగతి గదులు లేక గోడలు లేని స్లాబ్ క్రిందనే తరగతి గదిని నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ముగ్గురు టీచర్లు, 30 మంది విద్యార్థులు ఉన్నారు. కట్టవారిగూడెం ప్రాథమిక పాఠశాల లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ కూడ ఉన్న తరగతి గదిని కూల్చివేసి కొత్త గది నిర్మాణం చేపట్టగా స్లాబ్ వేసిన కంట్రాక్టరుకు బిల్లులు రాక అంపూర్తిగా వదిలేశాడు.



గుర్రంపోడులో రెండేళ్లుగా అసంపూర్తిగా నిలిచిన గోడలు లేని భవనంలోనే పాఠాలు

టీచర్ ఒక్కరే.. విద్యార్థులు లేరు

ఆలేరురూరల్ : ఆలేరు మండలం గుండ్లెగుడెం గ్రామంలో ప్రభుత్వ పాథమిక పాఠశాలలో 2013 సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు మాత్రమే ఉండగా వారు వెళ్లిపోవడంతో ప్రాథమిక పాఠశాల మూతపడింది. తిరిగి 2018 సంత్సరంలో ప్రారంభించి ఒక ఉపాధ్యాయురాలిని నియమించారు. గత ఏడు సంవత్సరాలుగా ఒక్క విద్యార్థి కూడా బడిలో చేరలేదు. ఒక్క టీచర్ మాత్రమే స్కూల్‌కు హాజరవుతున్నారు. ఇంటింటికి తిరిగి బడిలో చేరమని చెప్పినా పిల్లలను తల్లిదండ్రులు చేర్పించడం లేదు. ఆలేరు పట్టణం పక్కనే ఉండడంతో దాదాపు 50 మంది పైనే పిల్లలు ప్రైవేట్ స్కూల్‌కు వెళ్తున్నారు.



గుండ్లెగుడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా కూర్చున్న ఉపాధ్యాయురాలు

ఒకే గదిలో ఐదు తరగతులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలంలో బాకిగూడెం, బెండల్‌పహాడ్, జువ్విగూడెం పాఠశాలలో విద్యార్థులు లేరు. ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారు, నక్కలపల్లి హైస్కూల్‌లో బాలికలకు బాత్‌రూమ్‌లు సక్రమంగా లేవు. మండల కేంద్రంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలల్లో కేవలం ఒక గది మాత్రమే ఉంది. ఆ గదిలోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో 47 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. కొందరికి చెట్లకిందనే పాఠాలు చెబుతున్నారు. నూతన భవనం మంజూరైనా పనులు చేపట్టలేదు. పాఠశాలలో బాత్‌రూమ్‌లకు డోర్లు లేకపోవడంతో టీచర్‌లు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



ఒక గదిలోనే తరగతులు నిర్వహిస్తున్న టీచర్‌లు

ఒక్కరే టీచర్.. నలుగురు విద్యార్థులు

యాదగిరిగుట్ట: మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే మహిళా టీచర్ ఉన్నారు. ఈ పాఠశాలలో గురువారం నలుగురు విద్యార్థులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు ఉండగా నలుగురు పాఠశాలకు రావడం లేదు. ఒకే టీచర్ అన్ని తరగతులకు బోధిస్తోంది. గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు ఉద్యోగ విరమణ చేసి వెళ్లిపోయారు.



మహబూబ్‌పేట గ్రామంలో నలుగురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

బాత్రూమ్‌లు లేక అవస్థలు: మండలంలోని మల్లిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 11 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు బాత్రూమ్‌లు లేక అవస్థలు పడుతున్నారు. ఒకే ఒక బాత్రూమ్ మాత్రమే ఉంది. ఈ బాత్రూమ్ కేవలం అమ్మాయిలకు మాత్రమే ఉంది.

విద్యార్థులు చేరలే..

నకిరేకల్ : నకిరేకల్ మండలంలోని మండలాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరగలేదు. ఏడు తరగతులకు మొత్తం 20మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో సౌకర్యాలు కూడా అరకొరగా ఉన్నాయి. వంటగది రేకులను కోతులు ధ్వంసం చేశారు. దీంతో ఎండలోనే భోజనం వండుతున్నారు. తాగునీరు కూడా లేక విద్యార్థులు ఇంటి నుంచే బాటిల్ తెచ్చుకుంటున్నారు. ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి విద్యార్థులు పాఠశాలలో చేరలేదు.



మండలాపురం పాఠశాలలో కొద్దిమంది విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

శిథిలమైన గదులు

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు ఉండగా.. 20 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్ల ఉన్నారు. మొత్తం మూడు గదులకు గాను ఒక గది పూర్తిగా శిథిలమై నిరుపయోగంగా ఉంది. మరో రేకుల గది కుడా శిథిలావస్థకు చేరింది. మిగిలింది ఒక్క గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.



మానాయికుంటలో శిథిలావస్థకు చేరిన పాఠశాల గది

ఒక్కడే సారూ.. ఒక్కరూ లేరు..

చందంపేట : చందంపేట మండలంలోని మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడు.. విద్యార్థులు మాత్రం ఒక్కరు కూడా లేరు. గతంలో ఈ పాఠశాల మూతపడగా.. విద్యార్థులను మళ్లీ పాఠశాలకు రప్పించాలనే ఉద్దేశంతో పాఠశాలను పునః ప్రారంభించారు. అయినప్పటికీ ఒక్క విద్యార్థి కూడా పాఠశాలలో చేరలేదు.



మోత్యతండాలోని ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయుడు శ్రీనివాస్

అయిదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు



ఒకటవ, రెండవ తరగతి విద్యార్థులకు కలిపి బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం కూరెల్ల ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 40 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులు అయిదు తరగతులను బోధించాల్సి ఉంది. ఒక గదిలో రెండు తరగతులకు చెందిన విద్యార్థులను కూర్చోబెడుతున్నారు. ఒక తరగతి విద్యార్థులకు ఒక రోజు.. మరుసటి రోజు మరో తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్నారు.

16 పాఠశాలలు మూత

పెద్దవూర: మండలంలో విద్యార్థులు లేరనే కారణంతో గత విద్యా సంవత్సరం 18 పాఠశాలలు మూతపడగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో 16 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శూన్యం. ఇందులో 11 గిరిజన తండాలలోని ప్రాథమిక పాఠశాలలే ఉండటం గమనార్హం. మండలంలో మొత్తం 47 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి.

మూతబడిన పాఠశాలలు ఇవే..

ఎంపీపీఎస్ గేమ్యానాయక్‌తండా, పాత జయరాంతండా, కొత్త జయరాంతండా, జగ్రాంతండా, మల్లేవానికుంటతండా, లింగంపల్లి, కొత్త జయరాంతండా, రామన్నగూడెంతండా, చింతపల్లితండా, జీపీఎస్ లేబర్ కాలనీ పైలాన్, సుద్దబావితండా, నాయినివానికుంటతండా, నాయినివానికుంట, రామన్నగూడెం, కోమటికుంటతండా, పాత జయరాంతండా ప్రాథమిక పాఠశాలలతో పాటు యూపీఎస్ కెనాల్ ఉర్దూ మీడియం, యూపీఎస్ కెనాల్స్ తెలుగు మీడియం పాఠశాలలు మూత బడ్డాయి. మూత పడిన పాఠశాలు మొత్తం 16 ఉండగా ఇందులో గిరిజన తండాలలో మూతపడినవి 11 ఉండటం గమనార్హం. దీంతో గిరిజన తండాలలలో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో 18 పాఠశాలలు మూతపడగా ఈ ఏడాది మల్లిపురి, సుద్దబావితండా ప్రాథమిక పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి.



పెద్దవూర: విద్యార్థులు లేక మూతబడిన నాయినివానికుంటతండా పాఠశాల

38మందికి రెండు గదులు మాత్రమే..

బొమ్మలరామారం: మండలంలోని తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో 5 తరగతుల్లో 38 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ కలిసి రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో రెండు గదుల్లోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులకు స్టాఫ్‌రూం లేక ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా మైసిరెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, ఏడుగురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరిలో 1వ తరగతిలో నలుగురు, మూడో తరగతిలో ఇద్దరు, నాల్గో తరగతిలో ఒక విద్యార్థి ఉన్నారు. రెండు, ఐదు తరగతుల్లో విద్యార్థులులేరు.



తిర్మలగిరి ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో కూర్చున్న మూడు తరగతుల విద్యార్థులు

కనీస సౌకర్యాలు కరువు

నాగారం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు ఉండగా.. ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఉపాధ్యాయులే మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఐదారేళ్ల కిత్రం వంట గది నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో ఒక తరగతి గదిని వంట కోసం కేటాయించారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరి నిరూపయోగంగా మారాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



నాగారంలోని ప్రాథమిక పాఠశాలలో వంట చేయడానికి కేటాయించిన తరగతి గది